ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు

జిల్లా వార్తలు

గురువారం 12 సెప్టెంబరు 2024



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

వరద ఊరు మీదకొచ్చిందా? ఊరు నదిలోకి వెళ్లిందా?

ఈ ప్రశ్న ఎవరిని అడిగినా ఊరే వంకలోకి వెళ్లిందన్నదే జవాబు. 500 అడుగుల వెడల్పున్న నీవా నది.. చిత్తూరు నగరంలోకి వచ్చేసరికి చిక్కిపోవడమే దీనికి నిదర్శనం. దీనివల్ల పెద్ద వర్షాలకు నదీ పరివాహక ప్రాంతాలు జలమయమవుతున్నాయి. నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. అయినా.. ఆక్రమణలు క్రమేణా పెరుగుతున్నాయే కానీ తగ్గకపోవడం విచారకరం. విజయవాడ వరదను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా స్పందించకుంటే ఎప్పుడో ఒకప్పుడు మనకూ అంతటి ప్రమాదం ఎదురుకాక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. - చిత్తూరు

మనకు వరద వస్తే..?

- చిత్తూరుకూ పెద్ద ప్రమాదమే
- నీవా నది పరివాహక ప్రాంతాల్లో భారీగా ఆక్రమణలు
- నదిలోకి వచ్చిన నిర్మాణాలు



నివర్ తుఫానుకు నీట మునిగిన నీవా నది పరివాహక ప్రాంతాలు (ఫైల్ ఫొటో)



షుగర్ ఫ్యాక్టరీ వద్ద నీవానదిలోనే కట్టిన ఇళ్లు

తమిళనాడులోని పరదరామి అటవీప్రాంతంలో ప్రారంభమయ్యే నీవానది యాదమరి, చిత్తూరు మీదుగా ప్రవహిస్తోంది. నగరానికి ప్రధాన నీటివనరుగా.. ప్రజల అవసరాలను తీర్చింది. నగరానికి సంబంధించి ఇరువారం పోతంబట్టు నుంచి దొడ్డిపల్లి వరకు సుమారు ఆరు కి.మీ.ల పొడవున ఉంది. గతంలో దాదాపు 15 చెరువుల అనుసంధానం ఉంది. క్రమేణా నీవానదికి వచ్చే ప్రధాన కాలువలు మూసుకుపోవడంతో ప్రవాహం తగ్గిపోయింది. 30 ఏళ్ల కిందట గలగలా ప్రవహించిన ఈ నది తర్వాత మురుగునీటి ప్రవాహంగా మారిపోయింది. ఇలా ప్రవాహం తగ్గేసరికి పరివాహక ప్రాంతాల ప్రజలు క్రమంగా నదిని ఆనుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నగరపాలక సంస్థ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలను నిర్మించారు. దీంతో నది వెడల్పు 500 నుంచి వంద అడుగులకు కుచించుకుపోయింది. నీవానదిలో అక్రమంగా నిర్మించిన ఇళ్ళకు ప్రమాదాలు లేకపోలేదు. వరదలు వచ్చిన సందర్భాల్లో ఈ నది ఉప్పొంగుతుంది. 2017లో కురిసిన వర్షాలకు నీవానదిలోకి వరదనీరు చేరింది. ఇక, 2020లో నివర్ తుఫాన్ ప్రభావంతో వరద ఉధృతికి నీవానది పరివాహక ప్రాంతాలు నీటమునిగాయి. తోటపాళ్యం, కైలాసపురం, వీరభద్రకాలనీ, రంగాచ్చారి వీధి, పోతంబట్టు, తేనబండ, ఆటోనగర్, రిక్షాకాలనీ, గంగనపల్లి తదితర ప్రాంతాలు నీట మునిగాయి. నిరాశ్రయులకు వారం రోజుల పాటు నగరంలోని 16 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరద సమయంలో పేరుకుపోయిన బురద, మట్టిని తొలగించడానికి పది రోజులు పట్టింది. సకాలంలో అధికారులు స్పందించడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ, ఆస్తి నష్టం వాటిల్లింది. వారం పాటు అక్కడి ప్రజలు పునరావాస కేంద్రాల్లో ఉండాల్సి వచ్చింది.

ప్రతిపాదనలకే ప్రహరీ

నివర్ తుఫాన్ సందర్భంగా సుమారు 15 కాలనీలు నీట మునిగాయి. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. నీవా నదిలో ఆక్రమణలను నివారించడంతో పాటు నదికి రెండువైపులా 10- 12 అడుగుల మేర ఆరు కిలోమీటర్ల మేర రిటైన్ వాల్ నిర్మాణానికి రూ.112 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. అక్కడితో సరి.

ఇప్పటికైనా కళ్లు తెరవకుంటే..

నీవానది పరిసరాల్లో ఇళ్ల నిర్మాణాలను అప్పట్లో నగరపాలక సంస్థ అధికారులు ధ్వంసం చేశారు. ఇక్కడ నిర్మాణాలు సురక్షితం కాదని చెప్పినా వినిపించుకోని కారణంగా వారి నిర్మాణాలను సైతం కూలదోసేశారు. ఆ తర్వాత అక్రమ నిర్మాణాలను పట్టించుకోలేదు. నీవానదికి పెద్ద వరద రాలేదు కదా అని నిర్లక్ష్యంగా ఉంటున్నారు. విజయవాడలోని బుడమేరు విషయంలోనూ అక్కడి ప్రజలు అలాగే భావించారు. కానీ, ఇప్పుడు ఉన్నట్లుండి వచ్చిన పెద్ద వరద ఎంతటి ప్రమాదాన్ని తెచ్చిందో చూశాం. చిత్తూరులోనూ ఇప్పటికైనా కళ్లు తెరవకుంటే ఎప్పటికైనా ప్రమాదం పొంచే ఉంటుంది.



గంగనపల్లె శివారులో నీవానదిలోనే వెలసిన లే అవుట్లు



నీవానదిని పూడ్చేసి కట్టిన ఇళ్లు

నగరంలోని కార్మికులంతా వీరభద్రకాలనీ, రిక్షా కాలనీల్లోనే ఉంటున్నారు. 2022లో కురిసిన భారీ వర్షానికి నీవానది పొంగి ప్రవహించింది. దీంతో ఈ రెండు కాలనీలతో పాటు నీవానది పరివాహక ప్రాంతాలు నీట మునిగాయి. అధికారులంతా కాలనీలను సందర్శించి అక్కడి వారిని ఇతర ప్రాంతాలకు తరలించారు. వారం రోజుల పాటు ఆశ్రయం కల్పించి పంపించారు. చిన్నపాటి వర్షం కురిసినా ఇళ్లల్లోకి నీళ్లు వస్తుండటంతో ప్రతిసారి కన్నీటి కష్టాలు తప్పడం లేదు. వంకలో ఇళ్లు కట్టుకోవడం వల్ల ఎప్పటికైనా ప్రమాదమేనని, ఇక్కడి వారికి ప్రశాంత్‌నగర్‌లో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పినా స్థానికులు వెళ్లలేదు.

గంగనపల్లె శివారులో 500 అడుగుల వరకున్న నీవానదిని ఆక్రమణదారులు పూడ్చేసి లే అవుట్లు వేసి సొమ్ము చేసుకున్నారు. వంక మధ్యలో సిమెంటు రోడ్డు వేశారు. నగరంలోని వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డుకు అవతల వంకను పూడ్చుతున్నారు. ఇప్పటికే చాలా మంది ఇళ్లను కట్టుకున్నారు. ఇళ్లు, లే అవుట్ల స్థలం పోను ప్రస్తుతం అక్కడ 30 నుంచి 40 అడుగుల వరకు మాత్రమే నీవానది కనిపిస్తోంది. ఇలాగైతే వరదొస్తే పొంగదా? ఇళ్లు జలమయం కావా?

సంతపేట వద్ద నీవానదిపై లిల్లీ బ్రిడ్జిని కట్టారు. ఈ బ్రిడ్జికి కుడి, ఎడమ వైపుల 30 అడుగల వరకు వదిలేసి మిగిలిన స్థలాన్ని ఆక్రమించుకుని పలువురు ఇళ్లు కట్టేశారు. వర్షాలు వచ్చినప్పుడు హడావుడి చేసే నగరపాలక సంస్థ అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. దాంతో ఆక్రమణదారులు వంక స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలను కట్టుకుంటున్నారు.

నీవానదిని ఆనుకుని లాయర్స్ కాలనీ ఉంది. వంక పక్కన నిర్మిస్తున్న ఇళ్లను ముందుకు జరిపి వంక స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. ఇలా కాలనీ పొడవునా సుమారు 50 నుంచి వంద అడుగుల వరకు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.



లిల్లీ బ్రిడ్జికి రెండు వైపులా ఆక్రమించి కట్టిన ఇళ్లు







రెండేళ్ల కిందట నీట మునిగిన వీరభద్రకాలనీ (ఫైల్ ఫొటో) - నీవానదిలోనే కట్టిన వీరభద్రకాలనీ



వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం

- పవన్‌కల్యాణ్‌కు అందజేసిన బంగారుపాళ్యంకు చెందిన సినీహీరో

బంగారుపాళ్యం, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జెట్టి మిస్టర్ కళ్యాణ్ సినీ హీరో మురళీకృష్ణ రూ.పది లక్షల విరాళం అందించారు. ఈయన బంగారుపాళ్యం మండలం జంబువారిపల్లె పంచాయతీ మాధవనగర్‌కు చెందిన చలపతి నాయుడు, భారతి దంపతుల కుమారుడు. రూ.10,00,005 విరాళ చెక్కును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందజేశారు. కాగా, బంగారుపాళ్యంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద 'హండ్రడ్ డ్రీమ్స్' అన్నసూక్తం పేరుతో ప్రతిరోజూ నిరుపేదలకు రూ.1కే మురళీకృష్ణ భోజనం అందిస్తున్నారు. గత ఐదేళ్లుగా తన సొంత ఖర్చులతో పేదలకు ఒక పూట కడుపునిండా అన్నం పెడుతున్నారు.

పాఠం చెబుతూనే.. నేల కొరిగి

- గుండెపోటుతో మృతిచెందిన హెచ్ఎం



వేమచంద్రారెడ్డి (ఫైల్‌ఫొటో)

పలమనేరు, సెప్టెంబరు 11: పలమనేరు మున్సిపాలిటీ గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వేమచంద్రారెడ్డి(56) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం ఉదయం ఆయన విద్యార్థులకు పాఠం చెబుతూ ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే ఉపాధ్యాయులు ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. వేమచంద్రారెడ్డి యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తంచేశారు.

స్వర్ణ శేషుడిపై వరసిద్ధుడు



ఉదయం నిర్వహించిన చిన్న శేషవాహనం



పుష్పయాగం సందర్భంగా ఉత్సవర్లకు హారతి



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11: కాణిపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వరసిద్ధుడు స్వర్ణ శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, కాణిపాకం,వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె,తిరువణంపల్లె, చిగరపల్లె, అగరం పల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాన్ని, ధ్వజ స్తంభాన్ని, సుపథ మండపాన్ని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకాన్ని నిర్వహించాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు చిన్నశేష వాహనంపై పురవీధులలో ఊరేగారు. రాత్రి ఉభయ వరస రావడంతో కల్యాణ వేదిక వద్ద సిద్ధి,బుద్ధి సమేత గణపతి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. స్వర్ణ పెద్దశేష వాహనంపై ఉత్సవర్లను కాణిపాకంలో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు మురళీ మోహన్, గురజాల జగన్మోహన్, జడ్పీటీసీ సుచిత్ర, ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, మాజీ జడ్పీటీసీ లత, రైతు నేత గంగారపు హరిబాబునాయుడు, ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, ఉభయదారులు పాల్గొన్నారు.

వేడుకగా కలశ ఊరేగింపు : శేష వాహనం సందర్భంగా బుధవారం మణికంఠేశ్వరస్వామి ఆలయం నుంచి ఉభయదారులు పాలు కలిగిన కలశాలను తలపై పెట్టుకుని మాడ వీధుల గుండా ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. ఈ ఊరేగింపులో కేరళ వాయిద్యాలు, బాజాభజంత్రీలు, కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కల్యాణ వేదికపై సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లకు అభిషేకం.. ఆ తర్వాత పుష్పయాగం నిర్వహించారు.

కాణిపాకంలో నేడు : గురువారం ఉదయం చిలక వాహనం, రాత్రి వృషభ వాహన సేవను నిర్వహించనున్నారు. ఉదయం సేవకు కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు.. రాత్రి వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.



రాత్రి.. స్వర్ణ శేష వాహనంపై ఊరేగుతున్న ఉత్సవర్లు



కలశాల ఊరేగింపులో ఉభయదారులు.. భక్తుల కోలాటాలు



పోలీసులకు తలనొప్పిగా



సత్యవేడు ఎమ్మెల్యే కేసు

- అటు దళిత ఎమ్మెల్యే.... ఇటు టీడీపీ మహిళా నేత
- హోటల్‌కు రాకపోకలపై ప్రాథమిక ఆధారాలు లభ్యం
- ఫోన్ కాల్ డేటా సేకరణపై దృష్టి -అనివార్యంగా కుట్ర కోణంపైనా దర్యాప్తు

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటు చూస్తే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నది అధికార పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యే.. ఇటు చూస్తే ఆరోపణలు చేసింది అదే అధికార పార్టీకి చెందిన మహిళా నేత... ఆరోపణలు చేస్తున్నది, ఎదుర్కొంటున్నది ఇరువురూ సమాజంలో అణచివేత ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారే... ఎలా చూసినా సున్నిత వ్యవహారం కావడంతో సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదైన కేసు పోలీసు వర్గాలకు తలనొప్పిగా మారింది. దీంతో నిష్పాక్షిక దర్యాప్తుతోనే ఒత్తిడులను అధిగమించాలని, తద్వారా ప్రభుత్వాన్ని ఎవరూ తప్పుపట్టే అవకాశం లేకుండా చేయాలని జిల్లా పోలీసు అధికారులు భావిస్తున్నారు. గత గురువారం అర్ధరాత్రి కేవీబీపురం మండలానికి చెందిన ఓ తెలుగు మహిళ నాయకురాలు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన మహిళే ఈ కేసు విచారణకు సహకరించకపోతుండడం పోలీసు అధికారులకు సమస్యగా మారుతోంది. మరోవైపు ఫిర్యాది, నిందితుడు అధికార పార్టీకి చెందిన వారే కావడంతో కేసు దర్యాప్తు నిష్పాక్షికంగా జరుగుతుందా లేదా అన్నది ఇపుడు అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజానీకంలోనూ చర్చనీయాంశంగా మారుతోంది.

మొబైల్ ఫోన్ కాల్ డేటాయే కీలకం

కేసును ఎంతోకొంత పరిష్కరించగలిగిన ఆధారాల్లో కీలకమైంది మొబైల్ ఫోన్ కాల్ డేటా. దీంతో పోలీసులు ఎమ్మెల్యే ఫోన్, బాధిత మహిళ వినియోగిస్తున్న రెండు ఫోన్లు, ఆమె భర్త ఫోన్లకు సంబంధించిన కాల్ డేటాపై దృష్టి సారించారు. బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్న జూలై 6, 17 తేదీలతో పాటు ఆగస్టు 10వ తేదీ... ఈ మూడు రోజుల్లో వీరి ఫోన్ల నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? ఎవరెవరి నుంచీ కాల్స్ వచ్చాయి? ఎమ్మెల్యే, బాధిత మహిళల్లో ఎవరు ఎన్ని సార్లు ఎదుటి వారికి కాల్ చేశారు? అనే వివరాలు సేకరించే పనిలో పడ్డారు. అదే విధంగా ఆయా తేదీలకు అటూఇటూ పది రోజుల కాల్ డేటా కూడా సేకరిస్తున్నారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు, ఫిర్యాదు వెనుక కుట్ర ఏమైనా వుందా అన్న కోణంలో కూడా దర్యాప్తు అనివార్యం కానుంది. అందుకే బాధిత మహిళకు, ఆమె భర్తకు ఘటన జరిగిన మూడు రోజులకు ముందు వెనుక రోజుల్లో ఎవరెవరి కాల్స్ వచ్చాయి? వీరి నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? అన్నది కూడా విశ్లేషించనున్నారు.

సీసీ ఫుటేజీల సేకరణ

తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు ఎమ్మెల్యే పిలుపుపై మూడు సార్లు వెళ్ళినట్టు బాధిత మహిళ ఫిర్యాదులో తెలిపిన మేరకు ఆ హోటల్‌లో సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరించారు. అయితే హోటల్‌లో సీసీ కెమెరాలు రికార్డు చేసే ఫుటేజీలు స్టోర్ అయ్యే హార్డు డిస్కు నుంచీ సంబంధిత రోజువారీ డేటా నెల రోజుల పాటు మాత్రమే వుంటుందని, అటు తర్వాత ఆటోమేటిగ్గా ఎరేజ్ అయ్యేలా సెట్టింగ్స్ పెట్టడంతో జూలై నెల 6, 17 తేదీల ఫుటేజీలు లభ్యం కాలేదని తెలిసింది. ఆగస్టు 10వ తేదీ ఫుటేజీలు మాత్రం దొరికాయని చెబుతున్నారు. అందులో ముందుగా ఎమ్మెల్యే ఆదిమూలం హోటల్‌కు రావడం, ఆ తర్వాత బాధిత మహిళ రావడం రికార్డయిందని సమాచారం. బాధిత మహిళ హోటల్ లోపలికి వెళ్ళాక గది వద్దకు, రిసెప్షన్ వద్దకు రెండు సార్లు అటూ ఇటూ తిరిగిన దృశ్యాలు రికార్డయినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సీసీ కెమెరాల హార్డ్ డిస్కును స్వాధీనం చేసుకున్న పోలీసులు దాని విశ్లేషణకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు సమాచారం.

సీసీ కెమెరా ఫుటేజీలతో ప్రయోజనం పరిమితమేనా?

దర్యాప్తులో సాంకేతికంగా ఒక దశ వరకూ మాత్రమే ఆధారాలు సేకరించగలమని, అంతకు మించి కేసులోని వ్యక్తుల ఉద్దేశాల విషయంలో తాము చేయగలిగిందేమీ లేదన్నది పోలీసు అధికారుల భావనగా తెలుస్తోంది. సీసీ కెమెరా ఫుటేజీలతో దర్యాప్తులో పరిమితంగానే ప్రయోజనం వుంటుంది తప్ప కేసు పరిష్కారానికి పెద్దగా ఉపయోగపడదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బాధిత మహిళను ఎమ్మెల్యే బెదిరించిన వీడియోలు కానీ లేదా ఆడియో రికార్డులు కానీ ఇప్పటి వరకూ బాధిత మహిళ పోలీసులకు ఆధారాలు ఇవ్వలేదని సమాచారం. అలాగే అసభ్యకరంగా లేదా బెదిరింపులతో కూడిన వాట్సాప్ మెసేజీలు కానీ ఎస్ఎంఎస్‌లు కానీ పెట్టినట్టు కూడా ఆధారాలు అందజేయలేదు.అలాంటి ఆధారాలు వున్నాయో లేదో కూడా బాధిత మహిళ పోలీసులకు వెల్లడించలేదు. అలాంటివి వుంటే ఆరోపణలకు అదనపు బలం కలిగించడంతో పాటు నేర నిరూపణ సులువయ్యేదని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా ఎమ్మెల్యే, బాధిత మహిళ ఆగస్టు 10న హోటల్‌కు వచ్చినట్టు ఆధారాలు లభించినా నేరాన్ని నిరూపించలేవన్నది వారి భావనగా వుంది. బాధిత మహిళ తనే రికార్డు చేసినట్టుగా చెబుతున్న వీడియోలో ఎమ్మెల్యే బెదిరించడం లేదా దౌర్జన్యంగా వ్యవహరించడం, అత్యాచారం చేసినట్టుగా దృశ్యాలు వుంటే దర్యాప్తు ఒక కొలిక్కి చేరినట్టే. అయితే అలాంటి దృశ్యాలు అందులో వున్నాయో లేదో దర్యాప్తులో తేలాల్సి వుంది. కాగా హోటల్‌లో ఆ మూడు తేదీల్లో గదులు ఎవరు బుక్ చేశారు? ఎవరి పేరిట బుక్ చేశారు? అన్నది కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఘటన జరిగినట్టు చెబుతున్న తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్ సిబ్బంది సాక్ష్యం కూడా కీలకం కానుంది. పోలీసు విచారణలో వారు వెల్లడించే అంశాలు దర్యాప్తుకు ఉపకరించే అవకాశముంది. బాధిత మహిళ చెబుతున్న తేదీల్లో గదుల్లోకి ముందుగా ఎవరు వెళ్ళారు? ఆయా సందర్భాల్లో బాధిత మహిళ తీరు ఎలా కనిపించింది? గదుల్లో పరిస్థితి అసాధారణంగా అనిపించింది ఏదైనా వుందా? అన్న సమాచారం రిసెప్షన్ సిబ్బంది, రూమ్ సర్వీస్ సిబ్బంది నుంచీ పోలీసులు సేకరించాల్సి వుంది.

ఎమ్మెల్యేని విచారించేది ఎపుడు?

గుండె సంబంధ సమస్యలతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్యే ఆదిమూలం ఎపుడు డిశ్చార్జి అవుతారో తెలియని పరిస్థితి. ఆస్పత్రి నుంచీ డిశ్చార్జి అయితే తప్ప పోలీసులు ఆయన్ను ప్రశ్నించడం వీలు కాదు. అప్పుడు కూడా వైద్యుల సూచనలు కీలకం కానున్నాయి. గుండె సంబంధ సమస్యలు వున్నప్పుడు ఇబ్బంది పెట్టే ప్రశ్నలు వేయద్దని వైద్యులు ఓ గడువు వరకూ సూచించే అవకాశమున్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. దళిత వర్గానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో ఏమి జరిగితే అది ఏ మలుపు తీసుకుంటుందోనని ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోందని దర్యాప్తు అధికారులు వాపోతున్నారు. ఇప్పటికే ఆదిమూలానికి మద్దతుగా టీడీపీలోనూ,వెలుపలా కూడా దళిత వర్గాలు ఆందోళన మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఆయనను పోలీసులు అరెస్టు చేయాలన్నా స్పీకరు అనుమతి తీసుకోవాల్సి వుంటుందని సమాచారం.అలాగని విచారణను సాగదీయడానికి కూడా వీల్లేని పరిస్థితి. అధికార పార్టీకే చెందిన మహిళా నేత తనపై లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడ్డారని చేసిన ఫిర్యాదు కావడంతో ఆ కోణంలోనూ దీన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితి లేదు. మరోవైపు ప్రభుత్వ, అధికార పార్టీ ప్రతిష్ఠలతో ముడిపడిన వ్యవహారం. ఈ కారణాలతో సాధ్యమైనంత త్వరగా విచారణ ముగించి వాస్తవాలను బయటపెట్టి తాము ఒత్తిడి నుంచీ బయటపడాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

వైద్య పరీక్షలకు, విచారణకు సహకరించని ఫిర్యాది

ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపడిన అంశం కావడంతో తిరుపతి పోలీసులు సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదు చేసిన కేసులో దర్యాప్తును వేగంగా మొదలుపెట్టారు. గత గురువారం అర్ధరాత్రి కేసు నమోదు కాగానే శుక్రవారం ఉదయాన్నే బాధితురాలిని వైద్య పరీక్షల కోసం రుయాస్పత్రికి తరలించారు. అయితే ఆమె వైద్య పరీక్షలకు అంగీకరించకపోవడంతో లిఖితపూర్వకంగా రాయించుకుని పంపివేశారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. చట్టప్రకారం వైద్యపరీక్షలు నిర్వహించాల్సి వున్నందున పోలీసులు బాధితురాలి వెంటబడుతున్నారు. ఆ క్రమంలో సోమవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళ వైద్య పరీక్షలు అవసరం లేదని మొండికేసినట్టు సమాచారం. తనను విచారించడం మాని ముందు ఎమ్మెల్యేని అరెస్టు చేసి విచారించాలంటూ ఆమె డిమాండ్ చేసినట్టు తెలిసింది. దీంతో మరోసారి ఆమెతో ఆ మేరకు స్టేట్‌మెంట్ రాయించుకుని పంపించేసినట్టు పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి వైద్యపరంగా చూస్తే ఈ పరీక్షలతో పెద్దగా తేలేది కూడా ఏమీ వుండదని అటు పోలీసులు, ఇటు వైద్యులు కూడా భావిస్తున్నారు. ఎందుకంటే అత్యాచారం జరిగిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహిస్తే పలు ఆధారాలు లభ్యమవుతాయి. దుస్తులపై వీర్యపు ఆనవాళ్ళు, బాధితురాలి దేహంపై ఏవైనా గాయాలు వంటివి వుంటే ఆ మేరకు బలమైన ఆధారాలు లభించేవి. సంబంధిత హోటల్ గదిలోని బెడ్డు, బెడ్ షీట్, టవల్ వంటివి కూడా సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాల్సి వుండేది. వాటి ద్వారా కూడా కొన్ని ఆధారాలు దొరికేవి. గత నెల 10వ తేదీన జరిగిన ఘటనపై పాతిక రోజుల తర్వాత ఫిర్యాదు చేయడం వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది. బాధిత మహిళ వైద్య పరీక్షలకు ఎందుకు నిరాకరిస్తున్నారన్నది పోలీసులకు అంతుబట్టడం లేదు.

సత్యవేడులో రాజకీయ నిశ్శబ్దం

ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం, ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయడం వంటి సంచలనాత్మక ఘటనలు జరిగినప్పటికీ నియోజకవర్గంలో రాజకీయంగా మాత్రం నిశ్శబ్దకర వాతావరణమే కనిపిస్తోంది. నియోజకవర్గ టీడీపీలో సైతం దళిత వర్గాలు మినహా మిగిలిన వర్గాలు ఎమ్మెల్యేకు మద్దతుగా ముందుకు రావడంలేదు. అదే సమయంలో ఆయనకు వ్యతిరేకంగానూ ఎలాంటి కార్యక్రమాలూ జరగకపోవడం గమనార్హం. ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, చివరికి విపక్షమైన వైసీపీ వర్గాలు సైతం ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఆందోళనలకు దిగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కాగా బాధిత మహిళకు కూడా ఎవరూ మద్దతుగా నిలవకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ నేపథ్యంలో తనపై లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలని కోరుతూ ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు.తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలు శోధించకుండా పోలీసులు నేరుగా కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్న ఆయన ఈ మొత్తం ఘటన ఓ హనీ ట్రాప్ అని తెలిపారు.

రైతు దగ్గర లంచమా?

- సిగ్గు లేదా అంటూ సర్వేయర్‌పై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే

పెనుమూరు, సెప్టెంబరు 11: 'రైతు దగ్గర డబ్బులు తీసుకుని తిప్పించుకునేందుకు నీకు సిగ్గులేదూ' అంటూ మండల సర్వేయర్ శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే థామస్ విరుచుకుపడ్డారు. తన వద్ద సర్వేయర్ రూ.7వేలు లంచం తీసుకుని పని మాత్రం చేయలేదని పెనుమూరు మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకి కేసీపల్లి పంచాయతీ బొంతివంక దళితవాడకు చెందిన రైతు బోడెబ్బ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే సర్వేయర్‌ను పిలిచి 'ఒకవైపు జీతం తీసుకుంటూ మళ్లీ రైతుల వద్ద లంచం తీసుకుంటావా.. సిగ్గులేదా నీకు.. గతంలో ఎన్నో కబ్జాలు జరిగాయి.. వారిపై చూపించు నీ ప్రతాపం అమాయక రైతులపై కాదు.. ఎవరైనా సర్వేయర్లు, వీఆర్‌వోలు లంచాలు అడిగితే సస్పెండ్ చేయిస్తా' అంటూ హెచ్చరించారు. అనంతరం సర్వసభ్య సమావేశానికి రాకపోకవడంపై రోడ్లు భవనాల శాఖ అధికారులను నిలదీశారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కనీసం గుంతలు పూడ్చి సహకరించాలని కోరారు.

గెస్ట్ టీచర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, సెప్టెంబరు 11: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఇంగ్లిష మీడియంలో గెస్ట్ టీచర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయాధికారిణి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఈడీతో పాటు టెట్‌లో అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు, బీఈడీలోని సంబంధిత సబ్జెక్టులో మెథడాలజీ కలిగి ఉండాలని వివరించారు. స్త్రీలకు జేఎల్ ఇంగ్లిష్ 01, జేఎల్ ఫిజిక్స్ 01, జేఎల్ కామర్స్ 01, పీజీటీ సోషియల్ స్టడీస్ 01, టీజీటీ హిందీ 01, టీజీటీ సోషియల్ స్టడీస్ 02, పీఈటీ 02 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. పురుషుల విభాగంలో జేఎల్ ఫిజిక్స్ 01, పీజీటీ సోషియల్ స్టడీస్ 01, టీజీటీ హిందీ 01, టీజీటీ ఇంగ్లిషు 01, టీజీటీ మ్యాథ్స్ 01, టీజీటీ ఫిజికల్ సైన్స్ 01, పీఈటీ 01 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు పూర్తిచేసిన దరఖాస్తులను డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్, ఏపీఎస్ఆర్ డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం పక్కన, పుత్తూరు రోడ్డు, చిత్తూరు అనే చిరునామాలో అందించాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 17 ఉదయం 10 గంటలకు డెమో తరగతులు ఉంటాయని వివరించారు.

ఇరువర్గాల ఘర్షణ: పలువురికి గాయాలు

సదుం, సెప్టెంబరు 11: రాజకీయ కక్షల నేపథ్యంలో సదుం మండలం పాలమంద పంచాయతీ పెద్దూరు హరిజనవాడకు చెందిన ఇరువర్గాల వారు బుధవారం రాత్రి ఘర్షణ పడ్డారు. చౌడేపల్లె రూరల్ సీఐ రాంభూపాల్, సదుం ఎస్ఐ షేక్షావలి కథనం ప్రకారం పాలమందలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన మునీంద్ర గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల పట్ల తీవ్ర వివక్ష చూపించేవారు. దీంతో మునీంద్ర ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఇటీవల కొందరు టీడీపీ వర్గీయులు వాదోపవాదాలు పడుతున్నారు. ఈ క్రమంలో హరిజనవాడలో బుధవారం జరిగిన గ్రామ దేవత జాతర సందర్భంలో కొందరు మునీంద్రతో ఫోన్లో కవ్వించారు. విషయం తెలుసుకుని పెద్దూరు నుంచి మునీంద్ర పక్షాన కొందరు చేరుకుని కత్తులు, కర్రలతో ఘర్షణకు దిగారు. మునీంద్ర వర్గీయులు శివ, ఖాదర్ బాషా, మల్లికార్జున, హరినారాయణ, రమేశ్, సలీం, రెడ్డప్ప, లవ్‌కుమార్ తదితరులు గాయపడ్డారు. వీరిని సదుం సీహెచ్‌సీకి తరలించారు. హరిజనవాడకు చెందిన నవీన్, రెడ్డిశేఖర్, రెడ్డి రమేశ్, అప్పరెడ్డి, మనోహర్, తదితరులు గాయపడి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతకుముందు పాలమంద వెళ్లి ఘర్షణలకు పాల్పడకూడదని హెచ్చరించినా ఇరువర్గాలూ ఘర్షణ పడ్డారని పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

45మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 11: ఇంటింటికీ నిత్యవసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 45మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.జిల్లావ్యాప్తంగా 5.45లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167మంది, పలమనేరు డివిజన్‌లో 169మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17తేదీల మధ్య నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు, వారి సహాయకులకు రూ.3వేలు చొప్పున ప్రభుత్వం జీతం చెల్లిస్తోంది. ఆగస్టు నెలలో కార్డుదారులకు నిత్యవసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 45 మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్ల జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 11: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లకు అపరాధ రుసుంతో ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో దేవరాజు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మీసేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా రూ.200 అపరాధ రుసుంతో అడ్మిషన్లు పొందాలని కోరారు. శాంతిపురం, ఐరాల, పూతలపట్టు, పాలసముద్రం, వెదురుకుప్పం, సోమల మండలాల్లో ఓపెన్ స్కూల్ సెంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు.

అరటి పండ్ల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

రూ.15లక్షల ఆస్తి నష్టం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన అరటిపండ్ల గోడౌన్లు - పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు11 : నగరి పోలీస్‌స్టేషన్ పక్క సందులోని అరటి పండ్ల గోడౌన్‌లో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.15లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. సీఐ మహేశ్వర్ కథనం మేరకు.. కళందర్, యూనస్, రహమాన్ షెడ్లు ఏర్పాటు చేసుకుని అరటిపండ్ల వ్యాపారం చేస్తున్నారు. మంగళవారం రాత్రి మంటలు ఎగసిపడి గోడౌన్లు పూర్తిగా కాలిపోయాయి. అరటి పండ్లు కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి ఉండొచ్చని భావిస్తున్నారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన గజదాడులు

- పాతపేటలో పంటల ధ్వంసం



ఏనుగులు నేలకూల్చిన కొబ్బరిచెట్లు - ధ్వంసమైన వరి పంట

కల్లూరు, సెప్టెంబర్ 11: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు మళ్లీ మొదలయ్యాయి. పాతపేట పంచాయతీలో అడుగుపెట్టిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. కొబ్బరి, వరి తదితర పంటలకు అపార నష్టం కలిగింది. మంగళవారం రాత్రి పాతపాళ్యం అటవీప్రాంతం నుంచి పాతపేటకు చెందిన రైతు నందగోపాల్ ఇంటి సమీపానికి చేరుకున్న ఏనుగుల గుంపు పశుగ్రాసం ధ్వంసం చేశాయి. అనంతరం ఘీంకారం చేశాయి. ఈ శబ్దాలకు గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొందరు యువకులు వీటిని తరిమేందుకు బళ్లారి డ్రమ్స్‌తో శబ్దాలు చేశారు. రైతులు కె. మునిరాజ, వై. నారాయణ కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో ఏనుగులు పెకలించాయి. శ్రీనివాసులు, నారాయణ, సుబ్రమణ్యం, చిన్నస్వామికి చెందిన వరి పంటను ధ్వంసం చేశాయి. సుమారు మూడెకరాల వరి పంట పూర్తిగా దెబ్బతింది. రైతు సుబ్రమణ్యంకు చెందిన అరెకరా టమోటా పంటను ఏనుగులు పాడు చేశాయి. పాతపాళ్యం అడవి నుంచి సుమారు నాలుగు ఏనుగులు వచ్చి నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఏనుగుల దాడులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పండించామని, చేతికొచ్చే సమయంలో ఏనుగులు దాడులు చేశాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

చెరువుకోన వద్ద మకాం

సోమల, సెప్టెంబరు 11: సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీలో చెరువుకోన వద్ద ఏనుగులు వారం రోజులుగా మకాం వేశాయి. తాగునీరు, అడవి సమీపంలోనే పొలాలు ఉండడంతో వాటికి ఇక్కడే ఆవాసంగా మారిందని రైతులు తెలిపారు. మంగళవారం రాత్రి గురికానివారిపల్లె సంచరించడంతో వరి, టమోటా, చెరకు తోట ధ్వంసమైనట్లు బాధితులు పేర్కొన్నారు. అడవిపందులకు తోడు ఏనుగుల రాకతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

49 మంది మహిళా పోలీసులకు కౌన్సెలింగ్



మహిళా పోలీసు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

చిత్తూరు, సెప్టెంబరు 11: జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు మహిళా పోలీసులకు బుధవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 140 మంది హాజరయ్యారు. ముందుగా వారికి పోస్టింగ్స్‌కు సంబంధించిన నియమ నిబంధనల గురించి ఎస్పీ మణికంఠ చందోలు వివరించారు. పోస్టింగ్ కోరుకున్న ఉద్యోగి తన స్వగ్రామం, వార్డు ఉండే సచివాలయం కాకుండా ఇతర సచివాలయాలను కోరుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న సచివాలయాల ఆప్షన్లను ప్రొజెక్టర్ డిస్‌ప్లేపై ఉంచి ఒక సచివాలయాన్ని ఎంపిక చేసుకోవాలని ఉద్యోగులకు అవకాశం ఇచ్చారు. దాంతో 49 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఏవో మోహనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు..

చిత్తూరు సిటీ: జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం ఎస్ఈ చంద్రశేఖర్ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగుల అభ్యర్థన మేరకు వారిదరఖాస్తులను పరిశీలించి ఉద్యోగుల బదిలీలు చేశారు.

ఆర్టీసీ జోన్ 4 ఈడీగా చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 11: ఆర్టీసీ కడప జోన్ 4 ఫుల్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిమ్మాడి చెంగల్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ స్థానంలో ఉన్న గిడుగు వెంకటేశ్వర్లు రెండు నెలల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే.తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారిగా వున్న టి.చెంగల్‌రెడ్డిని ఫుల్‌చార్జ్ ఈడీగా నియమిస్తూ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీచేశారు.రాయలసీమ పరిధిలోని తిరుపతి, చిత్తూరు,కడప, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాలకు ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.

విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డేకు 30 ఫిర్యాదులు

చిత్తూరు రూరల్, సెప్టెంబర్ 11: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డేకు 30 ఫిర్యాదులు వచ్చినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. అప్పటికప్పుడే 25 పరిష్కారమైనట్లు చెప్పారు. మిగిలిన ఐదింటికి త్వరలోనే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. తిరుపతి టౌన్‌లో 3, పుత్తూరు 17, చిత్తూరు ఆపరేషన్ 4, చిత్తూరు రూరల్ 1, మదనపల్లి 1, పుంగనూరు 5 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. గ్రీవెన్స్ డేపై ఏఈలు, లైన్‌మెన్లు, విద్యుత్తు శాఖ సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి బుధవారమూ నిర్వహించే గ్రీవెన్స్ డేను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీ.ఎర్రేపల్లి ఎంపీటీసీ రాజీనామా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 11 : ఐరాల మండలం పీ.ఎర్రేపల్లి ఎంపీటీసీ పీ.ప్రభాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు జడ్పీ సీఈవో గ్లోరియాకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాజీనామాను ఆమోదిస్తూ బుధవారం ఆమె ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీ ల్యాడ్స్ పనులను త్వరగా పూర్తి చేయండి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 11: ఎంపీ ల్యాడ్స్ కింద గత ఐదేళ్లలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎంపీ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాజీ ఎంపీ రెడ్డెప్పకు సంబంధించి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.9 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బస్‌షెల్టర్లు, కమ్యూనిటీ హాల్స్ వంటి 172 పనులు మంజూరయ్యాయని తెలిపారు. పూర్తిచేసిన పనుల బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రస్తుత ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు చెందిన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.1.69 కోట్లతో 37 పనులు మంజూరు చేశారని, త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి: సివిల్ జడ్జి


పగడాల శ్రీనివాసరావు

పలమనేరు, సెప్టెంబరు11 : పలమనేరులో ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. బుధవారంనాడిక్కడ ఆయన విలేకరులతో మాటాడారు. పలమనేరు జవుళివీధిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్‌జడ్జికోర్టు, సబ్‌కోర్టు ఆవరణలోని స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టుల్లో అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పలు కేసులు పరిష్కారం కోసం న్యాయవాదులు, పోలీసులు, సమన్వయంతో కృషిచేయాలన్నారు. రాజీమార్గమే రాజమార్గమని కక్షిదారులు గుర్తించి పరిష్కారానికి ముందుకు రావాలన్నారు.

బలవర్ధక ఆహారంతో బాలికలకు ఆరోగ్యం


మాట్లాడుతున్న వైద్యాధికారి నిరంజన్

పలమనేరు, సెప్టెంబరు11 : ఆరోగ్యంగా ఉండేందుకు బలవర్థకమైన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి నిరంజన్ సూచించారు. పీఎం పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఐసీడీఎస్, వైద్యఆరోగ్య శాఖ సంయుక్తంగా బాలికోన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 21 సంవత్సరాలు పైబడిన తరువాత మాత్రమే వివాహాలు చేసుకోవాలని సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. హిమోగ్లోబిన్ 13 ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని,సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, సూపర్‌వైజర్ నజ్మా, పాఠశాల హెచ్‌ఎం లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయితీ ఉలవలు సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల,సెప్టెంబరు11: ప్రభుత్వం 80శాతం రాయితీలో ఇస్తున్న ఉలవలు తీసుకొని భూముల్లో వేసుకోవాలని బోడిపాటివారిపల్లె మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు రైతులను కోరారు. బుధవారం బోడిపాటివారిపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి సుధారాణి ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుకు 5-10 కేజీలు ఉలవలు ఇస్తారన్నారు. 10 కేజీలు రాయితీ రూ.184 చెల్లించి తీసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు రామమూర్తి, హయత్‌బాషా, క్రిష్ణయ్య, తులసీరాం పాల్గొన్నారు.

సమస్య రహిత మున్సిపాలిటీగా కుప్పం


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 11: సమస్యల రహితంగా కుప్పం మున్సిపాలిటీని తీర్చిదిద్దడానికి వార్డుకు వచ్చి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కుప్పం పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 6 వ వార్డు అనిమిగానిపల్లెలో బుధవారం వార్డు ముంగిటకు మున్సిపల్ పాలన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సాధ్యమైనవాటికి అక్కడికక్కడే పరిష్కారాలు చూపించారు. ఇతర సమస్యలను గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్ సోమశేఖర్, టీడీపీ ముస్లిం నాయకుడు జాకిర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, టీడీపీ నాయకులు ఆర్ముగం, భారతి త్రిలోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెక్కునత్తం పంచాయతీలో పారిశుధ్య పనులు



కుప్పం రూరల్, సెప్టెంబరు 11: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీలో బుధవారం పారిశుధ్య పనులు విస్తృతంగా చేపట్టారు. మురుగు కాలువల్లో పూడిక తీసి, చెత్త మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెక్కునత్తం మణి, మునిరత్నం, బీరప్ప, రాము, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

పశువుల గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన


పాడి రైతులకు ఉచిత మందులు అందజేస్తున్న అధికారులు

సోమల, సెప్టెంబరు 11: పాడి రైతులు పశుపోషణలో మెలకువలు పాటించాలని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ బాల సుబ్రమణ్యం సూచించారు. బుధవారం మల్లక్కగారిపల్లెలో పశువుల గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 153 పశువులకు పిడుదుల పిచికారీ చేశారు. 60 దూడలకు నట్టల నివారణ మందు, లివర్ టానిక్ తాపించారు. 21 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో సోమల ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ నాయుడు, సోమల, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం పశువైద్యాధికారులు చందనప్రియ, శ్రీధర్, తబ్రీద్‌బాషా, మునిచంద్ర, సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుంజార్లపల్లెలో తాగునీటి సమస్యకు పరిష్కారం

శాంతిపురం, సెప్టెంబరు 11: గుంజార్లపల్లె ఎమ్మెఎస్‌ఆర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ విజయరామిరెడ్డి చర్యలు తీసుకున్నారు. రెండేళ్ళుగా ఈ గ్రామానికి తాగునీటి సౌకర్యం లేదు. వ్యవసాయ బోర్లపై ఆధారపడుతున్నారు. గత ప్రభుత్వంలో విన్నవించినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వంలో కొత్త బోరు తవ్వకానికి నిధులు మంజూరయ్యాయి. బుధవారం బోరు తవ్వాక జలాలు పుష్కలంగా రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కర్ణాటక మద్యం సీజ్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు11: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.... అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం ఆరోగ్యవరానికి చెందిన జయంత్‌జాన్, వినోద్‌కుమార్‌లు ద్విచక్రవాహనంలో 350 ప్యాకెట్లు కర్ణాటక మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి మద్యం స్వాధీనం చేసుకుని ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసిన్నట్లు తెలిపారు.

నేడు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ

కుప్పం, సెప్టెంబరు 11: వైద్య శిబిరంలో కంటి జబ్బులున్నట్లు గుర్తించిన వారికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు గురువారం కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. శాంతిపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని కడా పీడీ తెలిపారు. ఆగస్టు 8వ తేదీన నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేసి, అద్దాలు అవసరమైన వారి పేర్లను రిజిస్టర్ చేశామన్నారు. పేర్లను రిజిస్టర్ చేసుకున్నవారు హాజరై అద్దాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, సెప్టెంబరు 11: గుడుపల్లె మండలం జాతికర్తనపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు (బీసీ-ఎ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కుప్పం ఐసీడీఎస్ సీడీపీవో ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత రోస్టర్ అనుసరించి పదవ తరగతి ఉత్తీర్ణులైన వివాహిత మహిళలుఉ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. గురువారంనుంచి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 21వ తేదీలోగా కుప్పం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అటవీ అమరవీరులకు నివాళులు

పలమనేరు, సెప్టెంబరు11 : పలమనేరు అటవీశాఖ కార్యాలయం వద్ద బుధవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అమరవీరులకు అధికారులు నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో సబ్‌డిఎఫ్ఓ వేణుగోపాల్, రేంజర్ శివన్న ఎఫ్ఎస్ఓలు సురేంద్ర, అరుణ్‌బాషా, గార్డు రాధాకృష్ణ, ప్రేమలత, వీపీఎస్ నాయకులు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ మేనేజర్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు11: స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ మేనేజర్ కార్యక్రమం శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సర్వీసులో సమస్యలు, సూచనలు, సలహాలు స్వీకరించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్తి తగాదాలో అన్నదమ్ముల ఘర్షణ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు11: ఆస్తి తగాదాలో అన్నదమ్ములు ఘర్షణ పడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నారేవారిపల్లెకు చెందిన బసిరెడ్డి కుమారులు చిన్నరెడ్డెప్పరెడ్డి, వాలిరెడ్డిలు అన్నదమ్ములు. వీరికి ఐదెకరాల పొలం ఉంది. భూమికి దారి కావాలని బుధవారం వీరిద్దరూ ఘర్షణ పడ్డారు. ఇద్దరూ గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు11: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా... మండలంలోని పాళ్యంపల్లెకు చెందిన చెన్నప్ప కుమారుడు రామారావు బుధవారం ద్విచక్రవాహనంలో సొంత పనులపై పుంగనూరు వచ్చాడు. ప్రైవేటు బస్టాండ్‌లో మరో వాహనం ఢీకొనడంతో ఇతడు గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న వైసీపీ నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు11: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ బస్టాండ్‌లో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అలిత, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. **సోమల**: సోమల బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి పంచారు. **కల్లూరు:** కల్లూరులో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు.

మృతుని కుటుంబానికి సాయం



గుడుపల్లె, సెప్టెంబరు11: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇటీవల మృతి చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రామక్రిష్ణ కుటుంబ సభ్యులకు సహోద్యోగులు బుధవారం రూ.41 వేల ఆర్థిక సాయం అందజేశారు. రామక్రిష్ణ కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ అండతో గుండె 'చెరువు'

ఆక్రమణలతో కుచించుకుపోయిన గౌనికుంట చెరువు



ఆక్రమణతో చిక్కిపోయిన గౌనికుంట చెరువు- చెరువు భూమి ఆక్రమణ ఇలా..

గుడుపల్లె, సెప్టెంబరు11: మండలంలోని గుండ్లసాగరం పంచాయతీ చెందిన గౌనికుంట చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గుండ్లసాగరం గ్రామానికి కొంత దూరంలో సర్వే నెం.95-1లో 7.98 ఎకరాల్లో ఈ చెరువు ఉంది. గుడుపల్లె-కుప్పం ప్రధాన రహదారి పక్కన ఉండడంతో చెరువు భూమిపై వైసీపీ చెందిన వారి కన్ను పడింది. కుప్పం వైసీపీ నాయకులు అండదండలు ఉండడంతో ఈ భూమిని కొందరు ఆక్రమించారు. 7.98 ఎకరాలు ఉన్న చెరువు భూమిలో నాలుగు ఎకరాలు ఆక్రమణకు గురైంది. చెరువు మూడు ఎకరాలకు పరిమితమైయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమి విలువ ఎక్కువగా ఉండడంతో కొందరు ఆక్రమించుకొని పాట్లుగా మార్చి విక్రయానికి సిద్ధం చేశారని వీరు ఆరోపిస్తున్నారు. ఆక్రమిత భూమిలో కొందరు వివిధ రకాల పంటలు పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. చెరువు మొరవ కూడా ఆక్రమణకు గురికావడంతో నిండితే నీరు అంతా ప్రధాన రహదారిపై పారుతూ అసౌకర్యానికి గురైతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. కొన్నేళ్లుగా గౌనికుంట చెరువు ఆక్రమణల నుండి కాపాడాలని పలు మార్లు మండల తహసీల్దారుకు, రెవెన్యూ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందంటున్నారు. వైసీపీ నాయకుల అండతో చెరువు ఆక్రమణదారులు పేట్రేగిపోయారని విమర్శిస్తున్నారు. ఆక్రమణతో భూమి కుచించుకొని పోయి చెరువు ఆయకట్టు కింద పంటలు పండక బీడుగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వే చేసి చెరువును కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనోత్సవాలు




రామకుప్పంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు- రొంపిచెర్లలో వినాయక నిమజ్జనం ఊరేగింపు - బైరెడ్డిపల్లెలో స్వామివారి లడ్డును స్వీకరిస్తున్న భువనచంద్ర గౌడు

రామకుప్పం, సెప్టెంబరు 11: పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవాలు ముగిశాయి. బుధవారం స్థానిక రామనగర్‌కాలనీ, శివాజీనగర్‌కాలనీల్లో వినాయక విగ్రహాలను యువకులు బాణసంచా, డప్పులు హోరు మధ్య ఊరేగించారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని, డప్పుల హోరుకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల్లో మునిగి తేలారు. ఊరేగింపు అనంతరం వినాయక విగ్రహాలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. **సోమల:** సోమల, పత్రపల్లె, కందూరు, పెద్దఉప్పరపల్లె, గట్టువారిపల్లె, తదితర ప్రాంతాల్లో ట్రాక్టర్లలో ప్రతిమలను బాణసంచా, డప్పులు, బళ్లారి డ్రమ్స్ హోరు నడుమ ఊరేగించారు. చెన్నపట్నం చెరువు, కొత్తచెరువుల్లో నిమజ్జనం చేశారు. సోమల శెట్టివారివీధిలో లడ్డూను శెట్టివారి సురేంద్రబాబు రూ.35వేలకు, వెండి కాయిన్‌ను విశాంత్ర ఎల్‌ఐ వన్నూరప్పగారి వెంకటరమణ రూ.50 వేలకు దక్కించుకున్నారు. **రొంపిచెర్ల:** పట్టణంలోని బలజవీధి, శ్రీరాములుగుడివీధి, పాలెంవీధి, బజారువీధి, వినాయకకాలనీలో ఉట్ల జాతర, అనదాన కార్యక్రమాలు నిర్వహించారు. **కల్లూరు:** తలారివారిపల్లిలో పెద్దలడ్డూను గ్రామానికి చెందిన వెంకటరత్నం రూ.10750కు, చిన్న లడ్డూను అనిల్ రూ.5750కు దక్కించుకున్నారు. స్వామివారిని కల్లూరు పుర వీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. **చౌడేపల్లె:** స్థానిక టీచర్స్ కాలని, గోసలకురప్పల్లె, సంతగేటు,కేటీ వీధిలతో పాటు, బిల్లేరు, బత్తాలాపురం తదితర గ్రామాల్లో ఉత్సాహభరిత వాతావరణంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. **పుంగనూరు రూరల్:** పట్టణంలోని ఏవీరావు వీధిలో విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. యువత ఉట్లు కొట్టి రంగులు చల్లుకుంటూ స్వామి వారిని ఊరేగించాక నిమజ్జనం చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. **వి.కోట**: పత్రపల్లెలో గణనాథుడి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. తర్వాత క్రేన్ సాయంతో నిమజ్జనం చేశారు. దాసార్లపల్లె, దయ్యాలపల్లె, పాపేపల్లి, భారత్‌నగర్, మొర్నపల్లె, యాదకుంట, యాలకల్లు కాలనీ, బీసీ పల్లె, నడిపేపల్లె, చిన్నాగనపల్లె, సంతగట్టు, పాముగానిపల్లె గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నెర్నపల్లె పంచాయతీ దయ్యాలపల్లెలో బుధవారం వినాయక విగ్రహ నిమజ్జనం కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. విగ్రహం ఎదుట కొందరు యువకులు బాణసంచా పేల్చుతుండగా సునీల్ అనే రిపోర్టర్ చేతికి గాయమైంది. వి.కోట సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలోని కురబవీధి, జవుకుపాళ్యం, నెహ్రూనగర్‌లో వినాయక ప్రతిమల నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. కురబవీధిలో లడ్డూను నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్ర గౌడు వేలంలో రూ.50,116కు దక్కించుకున్నారు.

సర్వీస్ రెగ్యులరైజేషన్‌కు కాంట్రాక్టు లెక్చరర్ల వినతి


ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

పలమనేరు, సెప్టెంబరు11 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీస్‌ను రెగ్యులరైజేషన్ చేయాలని స్థానిక టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి సహకరించాలని కోరారు. తనవంతు సాయం తప్పక చేస్తానని ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంట్రాక్టు లెక్చరర్లు గురుప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేంద్రకుమార్, లింగమయ్య, సురేష్, నూర్జాన్, ఉమామహేశ్వరి, తదితరులు ఉన్నారు.

బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన కడ పీడీ


సిబ్బందితో చర్చిస్తున్న వికాస్‌మర్మత్

శాంతిపురం, సెప్టెంబరు 11: రాళ్ళబూదుగూరులోని బీసీ వసతి గృహాన్ని బుధవారం కడ పీఓ వికాస్‌మర్మత్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్త భవనాన్ని నిర్మించాలని టీడీపీ నాయకులు కోరారు. ఎంపీడీఓ కుమార్, పీఆర్ ఏఈ కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, ఏఈ మనోజ్ఞ, సర్పంచు లక్ష్మీమురుగేస్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు : జడ్పీ చైర్మన్


పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న శ్రీనివాసులు

వి.కోట, సెప్టెంబరు 11: రోగులకు మెరుగైన సేవలు అందించాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఓగు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల సరఫరా, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రెండు స్టాఫ్ నర్సుల పోస్టులు భర్తీ చేయాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డీఎంఅండ్ హెచ్‌వోతో మాట్లాడి భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. డా.విజయ్‌కాంత్, ఇతర సిబ్బంది ఉన్నారు.

బలిజ సంఘ అధ్యక్షుడిగా రూపేష్


రూపేష్‌ను సన్మానిస్తున్న బలిజ సంఘ నాయకులు

పలమనేరు, సెప్టెంబరు11 : పలమనేరులోని బలిజ అభ్యుదయ సేవాసంఘం అధ్యక్షుడిగా స్థానిక సరస్వతి హోటల్ యజమాని రూపేష్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఆయనను బలిజ సంఘం నాయకులు సన్మానించారు. బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు సుధాకర్, అధ్యక్షుడు వీజేసీ బాబు, పీపీఎస్ కార్యదర్శి నరసింహులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సోమల వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడిగా రామకృష్ణ

సోమల, సెప్టెంబరు 11: మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడుగా కందూరు వీఆర్‌ఏ రామకృష్ణను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోదండన్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా యువరాజ్, ప్రధాన కార్యదర్శిగా కదిరప్ప, కోశాధికారిగా మాలిన్‌బీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శేఖర్, మునీశ్వర, లలిత, సుగుణ, షమీల పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు11: భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందని భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం గెజ్జిగానిపల్లెకు చెందిన చిన్నరామప్ప ఇటీవల భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె అలిగి 20 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. బంధువుల జోక్యం ఫలించక పోవడంతో చిన్నరామప్ప బుధవారం పురుగులమందు తాగాడు. అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న రాయలసీమ చిల్డ్రన్ అకాడమి డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి- పీఎస్‌మునిరత్నానికి చెక్కులు అందిస్తున్న శాంతిపురం మండల నేతలు- కుప్పం టీడీపీ నేత ప్రేమ్‌కుమార్ తదితరులు

వరద బాధితులకు బాసట

కుప్పం, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితుల కోసం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు రూ.5,52,111 మొత్తాన్ని సేకరించారు. ప్రేమ్‌కుమార్ రూ.లక్ష ఇచ్చారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం రూ.30 వేలు, రాజగోపాల్ రూ.లక్ష, సర్పంచి రవి రూ.20 వేలు, మల్లానూరు పంచాయతీ పార్టీ శ్రేణులు రూ.51 వేలు, పైపాళ్యం పంచాయతీ శ్రేణులు రూ.50 వేలు, మురళి రూ.20 వేలు, లీలా వెంకటేశ్ రూ.15 వేలు, చలపతి రూ.15 వేలు, శాంతారాం రూ.15 వేలు, క్లస్టర్ ఇన్‌ఛార్జి రవి రూ.10 వేలు, మహేంద్ర రూ.10 వేలు, సర్పంచి రాజేంద్ర రూ.10 వేలు, సంజీవి రాజు రూ.10 వేలు, వసనాడు పంచాయతీ శ్రేణులు రూ.10 వేలు, మోహన్ రూ.5 వేలు, మేఘనాథన్ రూ.5 వేలు, చంద్ర రూ.5 వేలు, శ్రీనివాసులు రూ.5 వేలు, శివకుమార్ రూ.5 వేలు, రాధాక్రిష్ణమూర్తి రూ.5 వేలు, భూపతి రూ.5 వేలు, పళణి రూ.5 వేలు, పువి రూ.5 వేలు, పొన్నువేల్ రూ.5 వేలు, రామకృష్ణ రూ.5 వేలు, ప్రకాశ్ రూ.5 వేలు, పీఎన్.చంద్ర రూ.5 వేలు, సుబ్రమణి రూ.5 వేలు, మంజునాథ్ రూ.5 వేలు, మురళి రూ.5 వేలు విరాళాలుగా అందించారు. రూ.5,52,111 విలువ గల చెక్‌ను బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నంకు అందించారు. **పుంగనూరు:** విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 25వేలు ఆర్థిక సహాయం అందించడంతో ఆ నగదును కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అందజేశారు. విశ్రాంత తహసీల్దార్ రెడ్డెప్పరాజు తదితరులు పాల్గొన్నారు. **శాంతిపురం**: మండల టీడీపీ నేతలు, నోబుల్‌స్కూల్ యాజమాన్యం రూ.2.9లక్షలు వితరణగా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు రూ.15000, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి రూ.2లక్షలు, మాజీ వైస్‌ఎంపీపీ ఉదయ్‌కుమార్ రూ.25000, నోబుల్‌స్కూల్ యాజమాన్యం రూ.5000 అందజేశారు. విరాళ చెక్కులను మండల నేతలు టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరత్నంకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఆంజినేయరెడ్డి, ఆర్‌ఎస్‌మణీ, చలపతి, కొళ్ళపల్లెబాబు పాల్గొన్నారు **పలమనేరు** : బేరుపల్లికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి రూ.10 వేలు విరాళ చెక్కును పలమనేరులో మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజరెడ్డికి అందజేశారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

పాలసముద్రం, సెప్టెంబరు 11: విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని తిరుమలరాజుపురంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మణి తన కుమారుడు వాసు (15)ను వెంటబెట్టుకుని అదే గ్రామంలోని ఓ రైతు పొలంలో కూలి పనులకు వెళ్లాడు. వాసుకు పుట్టుకతోనే మతి స్థిమితం లేదు. తండ్రి వ్యవసాయ పనులు చేస్తుండగా ఆ బాలుడు నీరు తాగేందుకు అక్కడే ఉన్న మోటారు వద్దకు వెళ్లాడు. మోటారుకు అమర్చిన విద్యుత్ వైరును ఎలుక కొరికి ఉండడం, దాన్ని ముట్టుకోవడంతో షాక్‌కు గురై వాసు అక్కడికక్కడే మరణించాడు. కుమారుడి మరణంతో మణి లబోదిబోమన్నాడు.

తృణ ధాన్యాలతో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశులు

పాలసముద్రం, సెప్టెంబరు 11: తృణ ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశులు తెలిపారు. శ్రీబొమ్మరాజుపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. తృణ ధాన్యాలు, తాజా ఆకుకూరలను ప్రదర్శించి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం



నింద్ర, సెప్టెంబర్ 11: మండలంలో బుధవారం గణేష్ నిమజ్జనం వేడుకలు కోలాహలంగా జరిగాయి. వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాలను ఐదవ రోజు నిమజ్జనానికి తరలించారు. ఉదయం మండపాల వద్ద ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉట్టికొట్టారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ చూపండి



అధికారులకు సూచనలిస్తున్న జడ్పీ సీఈవో

పూతలపట్టు, సెప్టెంబరు 11: మండలంలో జరుగుతున్న పారిశుధ్య పనులపై శ్రద్ధ చూపాలని జడ్పీ సీఈవో గ్లోరియా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామీణులు అంటురోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులదేనన్నారు. ఎంపీడీవో ధనలక్ష్మి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : యువకుడి మృతి



నరేంద్ర (ఫైల్ ఫొటో)

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11: మండలంలోని అడపగుండ్లపల్లె వద్ద బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. వెంగంపల్లెకు చెందిన అఖిల్, అతని స్నేహితుడు కురపపల్లెకు చెందిన యశ్వంత్ బైక్‌లో కాణిపాకం నుంచి ఐరాల మార్గంలో వస్తున్నారు. 45కొత్తపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు నరేంద్ర(25) మద్దిపట్లపల్లె నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తున్నాడు. అడపగుండ్లపల్లె వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. నరేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకుని తల్లిదండ్రులు బోరున విలపించారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 11: గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో వినతశ్రీ కోరారు. అంగన్‌వాడీ వర్కర్, మినీ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు 10వ తరగతి పాసై ఉండాలని, వయస్సు 21 నుంచి 35ఏళ్ల లోపు ఉండాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారు కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ప్రత్యేక ప్రతిభావంతులు సంబంధిత సర్టిఫికెట్లు జిరాక్స్‌పై గెజిటెడ్ సంతకం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా గంగాధర నెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో చేర్చాలని కోరారు.

వరసిద్ధుడికి గొడుగుల వితరణ



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి చిత్తూరుకు చెందిన కుమారస్వామినాయుడు బుధవారం నాలుగు గొడుగులు వితరణ చేశారు. దాతకు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ స్వామి దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



నగరి, సెప్టెంబరు 11 : గంగ జాతరను పురస్కరించుకుని ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. 20 సంవత్సరాలుగా మజ్జిగ వితరణ చేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రభు, సభ్యులు ఆనందకుమార్, కేఏకుమార్, దామోదరం, షణ్ముగం పాల్గొన్నారు.

అన్నదానం



గుడిపాల, సెప్టెంబరు 11: మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు జన్మదినం సందర్భంగా బుధవారం అన్న క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. కేక్ కట్‌చేసి, శాలువలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్, టీడీపీ నాయకులు ప్రతాప్ నాయుడు, ఆనంద్ యాదవ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, గోపి, ఆదం బాషా, హరినాయుడు, గోళ్ల హరిప్రసాద్ చౌదరి పాల్గొన్నారు. బాలాజీ సతీమణి భారతి చిత్తూరులోని తపోవనంలో వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బంగారుపాళ్యం, సెప్టెంబరు 11: మండలంలోని కల్లూరుపల్లి గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో బుధవారం డీడీఏ, ఏడీఏ, ఏవోలు, ఏపీఎంలు, సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వరి, వేరుశనగ పంటల సాగులో మెళకువలు, జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు నాగపద్మిని, ప్రాజెక్టు మేనేజర్ వాసు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 11: ప్రముఖ కవి, పల్లెసీమ పత్రిక వ్యవస్థాపకుడు ఎం.ఆర్.చంద్ర 96వ జయంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు బుధవారం జిల్లా ప్రధాన ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. రచయిత్రి అరుణకుమారి, మన సంస్కృతి సభ్యులు ఆర్.సహదేవనాయుడు, పద్మనాభనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వమే సీనరేజ్ వసూలు చేయాలి



నిరసన తెలుపుతున్న క్వారీ కట్టర్ల యజమానులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 11: ప్రభుత్వమే గ్రానైట్ సీనరేజ్ వసూలు చేయాలని చిత్తూరు గ్రానైట్ సంఘం ఆధ్వర్యంలో పుత్తూరు రోడ్డులోని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీనరేజ్ రాఘవ కన్‌స్ట్రషన్ వసూలు చేసేదని, కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని 2025 వరకు పొడిగించడం సరికాదని అన్నారు. తద్వారా తాము ఎంతగానో నష్టపోతామని తెలిపారు. ప్రభుత్వమే వసూలు చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

వరసిద్ధుడి సేవలో దీపా వెంకట్



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11: స్వర్ణభారత్ ట్రస్టు చైర్‌పర్సన్ దీపావెంకట్ బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో గురుప్రసాద్ ఆమెకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

రూ.2లక్షలు పలికిన
స్వర్ణ గణపతి లడ్డూ ప్రసాదం



దక్కించుకున్న లడ్డూ ప్రసాదంతో ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 11: స్థానిక బజారువీధిలో స్వర్ణకారులు ఏర్పాటు చేసిన స్వర్ణ గణపతి లడ్డూ ప్రసాదం రూ.2లక్షలు పలికింది. బుధవారం నిమజ్జనం సందర్భంగా వేలం వేయగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని రూ.2 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఎస్పీ మణికంఠ తల్లిదండ్రులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మేళతాళాలతో కట్టమంచి చెరువులో స్వామిని నిమజ్జనం చేశారు. బజారు వీధి స్వర్ణకారులు, జైన్ సంఘం, రాజాస్థాని సేవా సమితి, జ్యూయలరీస్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. నగరంలోని ఓటిచెరువు, గిరింపేట 25వ డివిజన్, భరత్‌నగర్, ఎంజీఆర్ వీధి, గంగనపల్లె, చవటపల్లె, రెడ్డీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకులను నిమజ్జనం చేశారు.

వరద బాధితులకు రూ.25 వేలు విరాళం



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పుంగనూరుకు చెందిన రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్ అధినేత చంద్రమోహన్ రెడ్డి రూ.25 వేలు విరాళం అందజేశారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలసి ఈ మేరకు చెక్ అందజేశారు.

22 కిలోల గంజాయి స్వాధీనం
ఓజీ కుప్పం వాసి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 11: గంజాయి రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి అతడి వద్ద 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ పరిధిలో గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై సీఐ మహేశ్వర రెడ్డి ఇటీవల ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తపల్లి రోడ్డు క్రాస్ వద్ద గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో మాటు వేసిన పోలీసులు నగరి మండలం ఓజీ కుప్పం గ్రామానికి చెందిన సత్తుపల్లి శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని అతని వద్ద 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.తిరుపతి మారుతీ నగర్‌లో కాపురముంటున్న శ్రీనివాసులు కిలో గంజాయిని రూ.10,000కు కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా మార్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో ప్యాకెట్ రూ.300 లెక్కన అమ్ముతున్నట్లు విచారణలో బయటపడింది.

వైభవంగా వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు





క్షీరాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయాధికారులు - క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు







కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాలను తిలకిస్తున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. - ఐరాల

సక్కుబాయమ్మకు ప్రముఖుల నివాళి





నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ - రాజేంద్రప్రసాద్

విజయపురం, సెప్టెంబరు 11: టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ తల్లి సక్కుబాయమ్మకు పలువురు నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఆమె కర్మక్రియలు బుధవారం విజయపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు నరేంద్ర, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీముత్యాలు, ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, వానపల్లి ముత్యాలరావు, లెనిన్ బాబు, కార్యదర్శులు దేవారెడ్డి, నాగేంద్రరెడ్డి, కుప్పాల మురళి, గోపిరెడ్డి, వెంకటేష్‌యాదవ్ తదితరులు పూలమాలవేసి, నివాళులర్పించారు. టీడీపీ నేతలు చినబాబు, బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, బీజేపీ నేతలు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, గాలి గోపినాయుడు, షణ్ముగంరెడ్డి, వెంకటేశ్వర్లు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే థామస్

పెనుమూరు, సెప్టెంబరు 11: మండలంలోని సీఆర్ కండ్రిగ దళితవాడలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే థామస్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజీలు, పింఛన్లు, మీటింగ్ హాల్ వంటి సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. వాటిని ఎంపీడీవో, సెక్రటరీలకు ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, తలారి రెడ్డెప్ప, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ రమ్యశ్రీ, నాయకులు కృష్ణమూర్తినాయుడు, భాస్కర్, ఎస్ఎస్‌నాయుడు పాల్గొన్నారు. కాగా, పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎంపీడీవో కార్యాలయంలో గర్భిణులకు సీమంతం చేసి, వస్త్రాలు సమర్పించారు. పురిటి పిల్లలకు అన్నప్రాసన చేయించారు. సీడీపీవో వినతశ్రీ, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, యూనియన్ లీడర్ శైలజ పాల్గొన్నారు.

చిత్తూరు ప్రెస్‌క్లబ్‌కి కొత్త కార్యవర్గం



ఎమ్మెల్యేలను కలసిన నూతన కమిటీ సభ్యులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 11: చిత్తూరు ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా జి.రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా టి.శివప్రసాద్, డి.పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వై.కాశేశ్వర రెడ్డి, సహాయ కార్యదర్శులుగా బి.దొరస్వామి, జె.నవీన్‌కుమార్, కోశాధికారిగా బి.అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఆర్.బాలసుందరం, సి.అయ్యప్ప నాయుడు, సీపీ.రావు, జి.కె.శివ, డి.రాజేష్, పి.చంద్రప్రకాష్, ఎస్.చంద్రశేఖర్, టి.రామకృష్ణ ఎన్నికయ్యారు. నూతనంగా కమిటీ సభ్యులను ఎమ్మెల్యే గురజాల, థామస్‌లు దుశ్శాలువలతో సత్కరించారు.

వైభవంగా నగరి గంగజాతర





సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ - గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న రోజా

నగరి, సెప్టెంబరు 11 : నగరి పట్టణం, చుట్టుపక్కల 72 గ్రామాలలో బుధవారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. నగరిలో మంగళవారం రాత్రి డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గంగమ్మ వేపాకు మందిరం చేరుకున్నారు. టీటీడీ వారు ప్రత్యేక పుష్పాలంకరణ చేపట్టారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి బారులు తీరారు. తడిబట్టలతో అంగప్రదక్షిణ చేశారు. అమ్మవారికి కర్పూరహారతి, కుంభం నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పెరుమాళ్ గుడి నుంచి చీర, సారెను మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి గంగమ్మకు సమర్పించారు. గంగమ్మ సోదరీమణులు ఓరుగంటాలమ్మ, దేశమ్మలను దర్శించుకున్నారు. ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, ఎస్వీపురం గ్రామాల్లోని వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రి రోజా గంగమ్మను, దేశమ్మ, ఓరుగంటాలమ్మలను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు కేజేకుమార్, కేజేశాంతి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాకేష్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు బలిదానం జరిగింది. రాత్రి 7.30 గంటలకు గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి జలంలో కలిపారు. టీడీపీ, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు
రూ.2.50 లక్షల బంగారు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 11: చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని రూ.2.50లక్షల విలువచేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. తన ఇంట్లో చోరీ జరిగినట్లు మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన భాగ్యవతి మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక పోలీసు బృందం గాలింపు చర్యలు చేపట్టారు. తుంబకుప్పం క్రాస్ వద్ద బుధవారం గడ్డంవారిపల్లెకు చెందిన సౌందర్‌రాజ్ నాయుడు కుమారుడు సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద 54 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2.50 లక్షలు ఉంటాయని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కోలాహలంగా నిమజ్జనం



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 11: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. 49.కొత్తపల్లెమిట్టలో భక్తులకు మీనాక్షమ్మ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. యువకులు డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ నిమజ్జనం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 11: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 132 కేవీ కొత్తపల్లిమిట్ట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పాలసముద్రం, జీడీనెల్లూరు మండలాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హోటల్‌లో వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు, సెప్టెంబరు 11: నగరంలోని కొంగారెడ్డిపల్లిలో గల ఒక హోటల్‌లో బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చిత్తూరు ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. ఎస్ఆర్‌పురానికి చెందిన జి.నాగరాజు(32) మంగళవారం రాత్రి హోటల్లో 223నంబరు గదిని అద్దెకు తీసుకున్నాడు. ఉదయం ఎంతకూ తలుపు తీయకపోవడంతో హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా ఫ్యానుకు ఉరేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



డీసీసీ అధ్యక్షుడిగా వెదురుకుప్పం మండలం బలిజ మొండి వెంగనపల్లెకు చెందిన పోటుగారి భాస్కర్ బుధవారం నియామకపత్రం అందుకున్నారు. విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేతుల మీదుగా తీసుకున్నారు. - వెదురుకుప్పం

గ్రామ సచివాలయం సాక్షిగా కదలని మురుగు

వెదురుకుప్పం, సెప్టెంబరు 11: పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని పదే పదే ఉన్నతాధికారులు చెబుతున్నా కొందరు కిందిస్థాయి సిబ్బంది స్పందించడంలేదు. కార్వేటినగరంలోని గ్రామ సచివాలయం ముఖద్వారం దగ్గరే మురుగు కుంట ఇందుకు సాక్ష్యం. ప్రసిద్ధ వేణుగోపాలస్వామి ఆలయం ముందు వందల అడుగుల దూరంలోనే ఉన్నా పారిశుధ్యం దారుణంగా ఉంది. ఈ వీధిలో మురుగు నీరు కదలక దోమలకు ఆవాస కేంద్రంగా మారిపోయింది. డ్రైనేజి కాలువల నిర్మాణంలో లోపాలుండటంతో మురుగునీరు కదలడంలేదని తెలిసింది. గతంలో మురుగునీటి కాలువల నిర్మాణంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఈ పరిస్థితి ఎదురైందని ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి చెప్పారు. మురుగు నీటిని మోటారుతో తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

కలుషితమవుతున్న చెరువు

కార్వేటినగరం పొలిమేరలోని దొరవారిగుంట చెరువును చెత్తచెదారం, కోళ్ల వ్యర్థాలను పోసి డంపింగ్ యార్డుగా మార్చేశారు. దీంతో ఆ చెరువులో చెత్తచెదారం కుళ్లి, దుర్వాసన వస్తోంది. చెరువు నీరు లోతట్టు ప్రాంతాల్లోని చెరువులు,గుంటలకు వెళ్తోందని స్థానికులు చెబుతున్నారు. కొందరు చెత్తచెదారాన్ని చెరువులో పడేసి రోగాలు ప్రబలడానికి కారకులవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. చెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపడతామని ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి పేర్కొన్నారు. ఆ మేరకు మేజర్ పంచాయతీ సిబ్బందికి ఆదేశాలిస్తామన్నారు.



సచివాలయం ఎదుట మురుగుగుంట